అన్యాయం చేసిన వారికి అవకాశమిద్దామా?

- కాంగ్రెస్ వస్తే ధరణి బంగాళాఖాతంలోకి..
- రైతులు అరేబియా సముద్రంలోకే
- ప్రజలను విభజించడమే బిజెపి పాలసీ
- దళారుల రాజ్యం కావాలో.. సంక్షేమ రాజ్యం రావాలో ఆలోచించండి : ముఖ్యమంత్రి కెసిఆర్

ప్రజాశక్తి- హదరాబాద్ బ్యూరో

'ఉన్న తెలంగాణను ఊడగొట్టిందే కాంగ్రెస్.. ఆ పార్టీ అనాలోచిత నిర్ణయం వల్లే 58 ఏండ్లు గోస పడ్డామని, తెలంగాణకు తీరని అన్యాయం చేసిన కాంగ్రెస్ పార్టీకి అవకాశం ఇద్దామా... ఇచ్చి మళ్లీ దళారుల రాజ్యం తీసుకొద్దామా.. అని సిఎం కెసిఆర్ ప్రశ్నించారు. 60 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో తెలంగాణ ఎట్లుండే.. 10 ఏళ్ల బిఆర్ఎస్ పాలనలో ఎలా మారిందో ప్రజలే ఆలోచించాలని కోరారు. కాంగ్రెస్ గెలిస్తే ధరణిని బంగాళా ఖాతంలోకి.. రైతులను అరేబియా సముద్రంలోకి వేస్తారన్నారు. అభ్యర్థులు ఎవరు బరిలో నిలిచారో, వారి వెనకున్న పార్టీని చూసి కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. బోధన్, నిజామాబాద్ అర్బన్, ఎల్లారెడ్డి, మెదక్ నియోజకవర్గాల్లో బుధవారం నిర్వహించిన బిఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభలకు సిఎం కెసిఆర్ హాజరయ్యారు. ఆ పార్టీ అభ్యర్థులు షకీల్, బిగాల గణేశ్‌గుప్త, జాజాల సురేందర్, పద్మాదేవేందర్‌రెడ్డికి మద్దతుగా ప్రచార సభల్లో పాల్గొని ప్రసంగించారు.

30 లక్షల 10 హెచ్‌పీ మోటార్లు కొనాలంటే ఎవడు కొనివ్వాలి

ధరణి, రైతుబంధు ఎత్తేస్తామని, 24 గంటల కరెంట్‌కు బదులు మూడు గంటల కరెంట్ ఇస్తామని, కాబట్టి 10 హెచ్‌పి మోటార్లు పెట్టుకోవాలని రేవంత్ రెడ్డి అంటున్నాడని కెసిఆర్ తెలిపారు. రైతుల వద్ద 10 హెచ్‌పి మోటార్ ఉంటదా..? 3 హెచ్‌పి, లేదంటే ఐదు హెచ్‌పి పెట్టుకుంటారని, నీళ్ల బాగా ఉంటే ఐదు హెచ్‌పి పెట్టుకుంటారని తెలిపారు. 30 లక్షల పంపు సెట్లు ఉన్న తెలంగాణలో 30 లక్షల 10 హెచ్‌పి మోటార్లు కొనాలంటే రూ. 30 వేల కోట్లు కావాలని, అంత డబ్బు ఎవడు ఇవ్వాలని ప్రశ్నించారు. అందుకే బంగాళాఖాతంలో ఎవరిని వేయాలో రైతులు, ఓటర్లు ఆలోచన చేయాలని చెప్పారు. బిఆర్ఎస్ పార్టీ తెలంగాణ ప్రజల హక్కుల కోసం, నీళ్ల కోసం ఏర్పడిందన్నారు. దేశంలో ప్రజాస్వామ్య ప్రక్రియలో పరిణతి రాలేదని, ప్రజాస్వామ్య పరిణితి సాధించిన దేశాలు ఎంతో అభివృద్ధి చెందాయన్నారు. గతంలో మోసపోయిన తెలంగాణ ప్రజలు ఇప్పుడు మోసపోవద్దన్నారు. బిజెపి మత పిచ్చితో మంటలు పెట్టే పార్టీ అని, ప్రజలను విడదీయడమే బిజెపి పాలసీ అని తెలిపారు. తెలంగాణలో అన్ని వర్గాలను, మతాలను బిఆర్ఎస్ పార్టీ కలుపుకొని పోతుందన్నారు. బిఆర్ఎస్ నూటికి నూరు శాతం లౌకికపార్టీ అని స్పష్టంచేశారు.

సభలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి కెసిఆర్

అనూహ్యమైన అభివృద్ధి

మెదక్ పట్టణంలో నిర్వహించిన సభలో సిఎం కెసిఆర్ మాట్లాడుతూ.. రాష్ట్ర తలసరి ఆదాయం, నాణ్యమైన విద్యుత్, సంక్షేమ పథకాల అమలులో దేశంలోనే తెలంగాణ నెంబర్ 1 స్థానంలో ఉందని తెలిపారు. రైతుల సంక్షేమం కోసం ఐదు కార్యక్రమాలను చేపట్టినట్టు వివరించారు. మెదక్‌లో అప్పటి కలెక్టర్ సూచనల మేరకు నీటి తీర్వ బకాయి డబ్బులను రద్దు చేశామని, నీటి ట్యాక్స్ లేదని తెలిపారు. అధికారంలో ఉన్న పార్టీ అభ్యర్థిని గెలిపిస్తేనే భవిష్యత్ ఉంటుందన్నారు. తెలంగాణకు కాంగ్రెస్ రూపంలో పెద్ద ప్రమాదం పొంచి ఉందని తెలిపారు. కేసీఆర్‌కు పని లేదని, ప్రజలు కట్టిన పన్నులతో రైతు బంధు ఇచ్చి దుబారా చేస్తున్నారని, 24 గంటల కరెంట్ వేస్ట్ అని కాంగ్రెస్ నేతలు ప్రచారం చేస్తున్నారని చెప్పారు. కాంగ్రెస్ హయాంలో మంజీరాను ఎండ బెట్టిందని, ఇప్పుడు ఘనపురం ఆనకట్ట కింద 40 వేలు పండుతున్నాయి. నీళ్లు కావాలంటే సంపూర్ణంగా తెచ్చే బాధ్యత తనదని స్పష్టం చేశారు. సంపద పెంచుకుంటూ ప్రజలకు పంచుకుంటూ బిఆర్ఎస్ పార్టీ ముందుకు పోతుందన్నారు. 2024 తర్వాత దేశంలో ప్రాంతీయ పార్టీల హవా ఉంటుందన్నారు. సమావేశంలో మంత్రులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టెన్త్ ఫీజు చెల్లింపు గడువు పొడిగింపు

- ఆలస్య రుసుముతో జనవరి 3 వరకు అవకాశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పదో తరగతి ఫీజు చెల్లింపు గడువును వచ్చేనెల రెండో తేదీ వరకు రాష్ట్ర ప్రభుత్వం పొడిగించింది. ఈ మేరకు ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు ఎ. కృష్ణారావు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆలస్య రుసుం రూ.50తో వచ్చేనెల 12 వరకు, రూ.200తో అదేనెల 21 వరకు, రూ.500తో వచ్చే ఏడాది జనవరి మూడో తేదీ వరకు ఫీజు చెల్లించేందుకు అవకాశముందని తెలిపారు. ఆయా తేదీల్లో సాధారణ సెలవులుంటే మరుసటి రోజు ఫీజు చెల్లించొచ్చని సూచించారు. విద్యార్థులు ఇతర సమాచారం కోసం www.bse.telangana.gov.in వెబ్ సైట్‌ను సంప్రదించాలని కోరారు. వచ్చే ఏడాది మార్చిలో పదో తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షలను నిర్వహిస్తామని తెలిపారు. పదో తరగతి చదువుతున్న విద్యార్థులంతా సకాలంలో ఫీజు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.

హైదరాబాద్‌లో విస్తృత తనిఖీలు

- ఇప్పటి వరకు రూ.49.50 కోట్ల నగదు సీజ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎన్నికల ప్రక్రియ మొదలైనప్పటి నుంచి అటు పోలీసులు, ఇటు ఫ్లయింగ్ స్క్వాడ్స్ ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నారు. బుధవారం ఒక్కరోజే హైదరాబాద్ నగరంలో రూ.1,15,000 సీజ్ చేశారు. ఇప్పటి వరకు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు 3,58,47,450 నగదును సీజ్ చేయగా, పోలీసుల ద్వారా రూ.3,67,183 సీజ్ చేశారు. మొత్తం కలిసి ఇప్పటివరకు రూ.49,50,20,372 నగదును సీజ్ చేశారు. బుధవారం ఒక్కరోజే 16 ఎఫ్.ఐ.ఆర్‌లు నమోదు కాగా, ఇప్పటి వరకు 727 కేసులు నమోదు చేశారు. 3064 బైండోవర్ చేశారు. 2262 నాన్ బెయిలబుల్ వారెంట్లు నమోదు చేశారు. 6,020 వాల్ రైటింగ్‌లు, 86,929 పోస్టర్లు, 30112 బ్యానర్ తొలిగించారు. 53 అనుమతి లేకుండా సమావేశాలు నిర్వహించడంతో కేసులు నమోదు చేశారు. మద్యం 184 లీటర్స్ సీజ్ చేశారు.

వంధ్యత్వ సమస్యను అధిగమించండి

- ఒయాసిస్ ఫెర్టిలిటీ డాక్టర్ కీర్తన

హైదరాబాద్ : వంధ్యత్వ సమస్యను జంటలు అధిగమించాల్సిన అవ సరం ఉందని ఒయాసిస్ ఫెర్టిలిటీ, ఫెర్టిలిటీ స్పెషలిస్ట్ డాక్టర్ వీ.కీర్తన తెలిపారు. నగరంలోని టోలిచౌకిలో గల ఒయాసిస్ ఫెర్టిలిటీలో ఐవిఎఫ్ ద్వారా గర్భం దాల్చిన తల్లులందరినీ మంగళవారం సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భారతదేశంలో 28 మిలియన్లకు పైగా జంటలు వంధ్యత్వ సమస్యను కలిగి ఉన్నారన్నారు. వీరిలో మూడు శాతం మంది మాత్రమే సంతానోత్పత్తి సహాయాన్ని తీసుకుంటున్నారని పేర్కొన్నారు. భయాల నుంచి బయటపడాలన్నారు. ఈ సమస్యను అధిగమించడానికి సంతానోత్పత్తి నిపుణుల సహాయం తీసుకోవాలని సూచించారు.

గజ్వేల్ బరిలో 44, కామారెడ్డిలో 39 మంది

- తుది అభ్యర్థులను ప్రకటించిన ఇసి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో గజ్వేల్, కామారెడ్డి నియోజకవర్గాలు ప్రత్యేకతను సంతరించుకున్నాయి. ఈ రెండు స్థానాల నుంచి సిఎం కెసిఆర్ పోటీ చేస్తుండటంతో అందరి దృష్టి ఈ నియోజకవర్గాలపైనే ఉంది. నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసిన తర్వాత గజ్వేల్ బరిలో 44 మంది అభ్యర్థులు ఉన్నారని రిటర్నింగ్ అధికారి తెలిపారు. స్క్రూటినీ తర్వాత 114 మంది బరిలో ఉండగా.. బుధవారం 70 మంది తమ నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. గజ్వేల్ నుంచి బిఆర్ఎస్ అభ్యర్థిగా సిఎం కెసిఆర్, బిజెపి నుంచి ఈటల రాజేందర్, కాంగ్రెస్ నుంచి తూముకుంట నర్సారెడ్డి పోటీ చేస్తున్నారు. వీరితో పాటు జగిత్యాల జిల్లాకు చెందిన ముగ్గురు చెరకు రైతులు, ఇద్దరు భూ నిర్వాసితులు కూడా పోటీలో నిలిచారు.

గజ్వేల్‌తో పాటు సీఎం కేసీఆర్ పోటీ చేస్తున్న రెండో నియోజకవర్గం కామారెడ్డి. నామినేషన్ల ఉపసంహరణ అనంతరం ఈ నియోజకవర్గం నుంచి 39 మంది బరిలో నిలిచారు. పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితాను రిటర్నింగ్ అధికారి ప్రకటించారు. నామినేషన్ల స్క్రూటినీ తర్వాత ఈ నియోజకవర్గంలో 58 మంది పోటీలో ఉండగా.. ఇవాళ 19 మంది నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. కామారెడ్డి నుంచి భారాస అభ్యర్థిగా సీఎం కేసీఆర్, కాంగ్రెస్ నుంచి పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, భాజపా నుంచి కె.వెంకట రమణారెడ్డి పోటీలో ఉన్నారు. సీఎం కేసీఆర్, రేవంత్‌రెడ్డి కామారెడ్డి నుంచి పోటీ చేస్తుండటంతో.. ఈ నియోజకవర్గం రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది.

మీడియాతో మాట్లాడుతున్న మధుయాష్కీ

మధుయాష్కీ ఇంట్లో పోలీసుల సోదాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్ ఎల్బీనగర్ అభ్యర్థి మధుయాష్కీ ఇంట్లో మంగళవారం అర్ధరాత్రి పోలీసులు సోదాలు నిర్వహించడం కలకలం రేగింది. బిఆర్ఎస్ నేతల ఫిర్యాదుతో హైదరాబాద్‌లోని హయత్‌నగర్ వినాయకనగర్‌లోని మధుయాష్కీ తాత్కాలిక నివాసంలో ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్, పోలీసులు కలిసి సోదాలు నిర్వహించారు. 100 నంబర్‌కు డబ్బు పంపిణీపై ఫిర్యాదు రావడంతో తనిఖీలు నిర్వహించినట్టు తెలిపారు. చివరకు ఇంట్లో ఎలాంటి నగదు లభించకపోవడంతో పోలీసులు వెనుదిరిగారు. ఈ సందర్భంగా మధుయాష్కీ మాట్లాడుతూ.. ఫిర్యాదు, వారెంట్ లేకుండానే ఇంట్లోకి పోలీసులు అర్ధరాత్రి చొరబడ్డారని ఆరోపించారు. ఫ్లయింగ్ స్క్వాడ్ పిలిస్తే వచ్చామని పోలీసులు, ఎసిపి పిలిస్తే వచ్చామని ఫ్లయింగ్ స్క్వాడ్ చెబుతూ చివరికి ఖాళీ చేతులతో వెళ్లారని తెలిపారు. పోలీసులతో పాటు మఫ్టీలో గులాబీ కార్యకర్తలు వచ్చారని ఆరోపించారు. కంప్లైంట్ చూపించమంటే 100 నంబర్‌కు కాల్ వచ్చిందని, తర్వాత కొద్దిసేపటికి కానిస్టేబుల్‌కు ఫోన్ చేసి కంప్లైంట్ లెటర్ రాయించి వాట్సాప్‌లో చూపించారని తెలిపారు. పోలీసు యంత్రాంగం కెసిఆర్ కింద కాదు..ఇసి కింద పని చేయాలని హితబోధ చేశారు. కనీస గౌరవం ఇవ్వకుండా వస్తువులను కాలితో తంతు ఎసిపి భీమిరెడ్డి దురుసుగా ప్రవర్తించారన్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గం ప్రజలు ఇదంతా గమనిస్తున్నారని, పోలీసులు, ఇసి వాళ్ళతో తన గెలుపును ఆపుదామనుకుంటే అది వారి వల్ల కాదని సుధీర్ రెడ్డికి సవాలు విసిరారు. ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయబోతున్నామని తెలిపారు. తోక పార్టీ బిజెపి పడే ఓటు బిఆర్ఎస్‌కు పడినట్టేనన్నారు.

కాంగ్రెస్‌కు అనిల్‌కుమార్ రాజీనామా

- త్వరలోనే భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తానని వెల్లడి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉమ్మడి మెదక్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి భారీ షాక్ తగిలింది. టిపిసిసి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మెదక్ పార్లమెంట్ ఇన్‌చార్జి గాలి అనిల్ కుమార్ ఆ పార్టీకి బుధవారం రాజీనామా చేశారు. మరో రెండు రోజుల్లో తమ కార్యాచరణ ప్రకటిస్తామని వెల్లడించారు. సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం పట్టణంలోని ఆశోక్‌నగర్‌లోని తన కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీని నమ్ముకొని ఇన్నేండ్లు కష్టపడ్డానని, కష్టపడ్డ వారికి సముచిత స్థానం దొరకడం లేదన్నారు. స్వంత డబ్బులు ఖర్చు పెట్టుకొని పార్టీ కోసం పనిచేస్తే.. బిసిలకు పూర్తిగా అన్యాయం జరిగిందని వాపోయారు. ఐదేండ్ల క్రితం టికెట్ ఇస్తానంటే కాంగ్రెస్ పార్టీలో చేరానని.. కానీ ఆనాడు, నేడు తనకు మోసమే జరిగిందన్నారు. ఎఐసిసి పెద్దలు తనను పలకరించారని, కానీ, ఇంత జరిగినా రాష్ట్ర నాయకత్వం పలకరించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తీవ్ర మనస్తాపం చెంది కాంగ్రెస్ పార్టీకి, పదవులకు రాజీనామా చేస్తూ ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, పిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డికి ఫ్యాక్స్ ద్వారా రాజీనామా పత్రాన్ని అందజేస్తున్నానన్నారు. భవిష్యత్తు కార్యాచరణ త్వరలోనే ప్రకటిస్తానని స్పష్టం చేశారు. సమావేశంలో నర్సాపూర్ ఎంపిపి జ్యోతి సురేష్ నాయక్, నర్సాపూర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, నర్సా పూర్ మండల మైనారిటీ ప్రెసిడెంట్ అజమాత్ అలీ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గైనకాలజీ సమస్యలను నిర్లక్ష్యం చేయవద్దు

- కిమ్స్ వైద్యులు వసుంధర చీపురుపల్లి

హైదరాబాద్ : మహిళలు మరీ ముఖ్యంగా యువతులు గైనకాలజీ సమస్యలను నిర్లక్ష్యం చేయవద్దని కిమ్స్ కడల్స్ సికింద్రాబాద్‌కు చెందిన ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ వసుంధర చీపురుపల్లి అన్నారు. గైనకాలసీ సమస్యలపై అపోహాలు-వాస్తవాలు, జాగ్రత్తలు అనే అంశంపై బేగంపేటలోని సెంట్ ఫ్రానిన్స్ కళాశాలలో బుధవారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వసుంధర చీపురుపల్లి మాట్లాడుతూ.. "యవ్వనంలోకి అడుగుపెట్టినప్పటి నుండి స్త్రీలలో అనేక రకాలైన సమస్యలు వస్తుంటాయి. ముఖ్యంగా రుతుక్రమంలో అనేక ఇబ్బందులు పడుతుంటారు. అవి కుటుంబ సభ్యులతో కూడా పంచుకోకుండా వారిలో వారే మదనపడుతారు. దీని వల్ల మానసికంగా కుంగిపోయి అనేక ఆరోగ్య సమస్యలకు గురవుతారు. మారుతున్న జీవనశైలిలో భాగంగా ప్రతి మహిళ ఆరోగ్యంపై ఖచ్చితమైన అవగాహన ఉండాలన్నారు' అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, విద్యార్థినిలు పాల్గొన్నారు.

అపోలో రేడియాలజీ ఇంటర్నేషనల్‌లో రేడియాలజీ శిక్షణ

హైదరాబాద్ : ప్రపంచ స్థాయి ప్రమాణాలతో అపోలో రేడియాలజీ ఇంటర్నేషనల్‌లో రేడియాలజీ శిక్షణ అందించడమే లక్ష్యమని అపోలో రేడియాలజీ ఇంటర్నేషనల్ సిఇఒ, ఎండి డాక్టర్ శ్రీనివాస రాజు కలిదిండి తెలిపారు. బుధవారం ఇక్కడ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అపోలో రేడియాలజీ ఇంటర్నేషనల్ (ఎఆర్ఐ) భారతదేశంలో రేడియాలజీ ల్యాండ్‌స్కేప్‌ను మార్చే దిశగా అడుగులు వేస్తుందన్నారు. ఈ రంగంలో శిక్షణ, నైపుణ్యంలో ఉన్న అంతరాన్ని తగ్గించే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నామని చెప్పారు. అంతర్జాతీయ అధ్యాపకులతో ప్రపంచ స్థాయి రేడియాలజీ విద్యను సరసమైన ధరకు భారతీయ రేడియాలజిస్టుల ఇంటి వద్దకు తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు.

బిజెపికి విజయశాంతి రాజీనామా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిజెపికి మరో బిగ్ షాక్ తగిలింది. తాజాగా సీనియర్ నేత విజయశాంతి రాజీనామా చేశారు. ఈ మేరకు తన రాజీనామా లేఖను బిజెపి పార్టీ తెలంగాణ అధ్యక్షుడు కిషన్ రెడ్డికి పంపారు. గత కొంతకాలంగా బిజెపి నిర్వహిస్తున్న కార్యక్రమాలకు, ఎన్నికల ప్రచారానికి దూరంగా ఉంటున్న విజయశాంతి... తాజాగా రాజీనామా చేశారు. ఇక విజయశాంతి త్వరలోనే కాంగ్రెస్ పార్టీ లో చేరనున్నట్లు సమాచారం. కాగా గతంలో టిఆర్ఎస్ పార్టీలో ఉన్న విజయశాంతి... తెలంగాణ వచ్చిన తర్వాత కాంగ్రెస్ పార్టీలో చేరారు. గత రెండు సంవత్సరాల కిందట బిజెపిలో చేరారు. ఇక ఇప్పుడు బిజెపికి రాజీనామా చేశారు.

మిర్యాలగూడలో ఎర్రజెండా ఎగరడం ఖాయం

- ధన బలం.. ప్రజాబలం.. మధ్యనే పోటీ
- ప్రజల గొంతుకగా నన్ను అసెంబ్లీకి పంపండి
- పలు గ్రామాల్లో జూలకంటి ప్రచారం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఈ ఎన్నికల్లో మిర్యాలగూడలో ఎర్రజెండా ఎగరటం ఖాయమని సిపిఎం అభ్యర్థి జూలకంటి రంగారెడ్డి ధీమా వ్యక్తంచేశారు. బుధవారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలంలోని బాధలపురం, అవంతిపురం, యాదగిరిపల్లి, ఉట్లపల్లి, తక్కెరపాడు తడకమళ్ళ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చి ఘన స్వాగతం పలికారు. పార్టీ కార్యకర్తలు అభిమానులు శాలవాలు, పూలదండలతో సన్మానించి అభినందనలు తెలిపారు. మహిళలు మంగళ హారతులు పడుతూ ఆశీర్వదించారు. ఈ సందర్భంగా జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ పదేళ్ల అధికారంలో ఉన్న బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రజల ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షలను నెరవేర్చడంలో విఫలమైందన్నారు. నయా నవాబు మాదిరిగా దొరల గడీల పాలన సాగిస్తున్న కెసిఆర్ ప్రభుత్వం పట్ల అన్ని వర్గాల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. ప్రజలకు అందుబాటులో లేని అధికార పార్టీ ఎమ్మెల్యే వల్ల నియోజకవర్గంలో అభివృద్ధి కుంటుపడిందని ఆరోపించారు. తాను మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా చేసినా పాత అభివృద్ధి పనులే కనిపిస్తున్నాయి తప్ప కొత్తగా ఏమీ లేదని ప్రజలు గుర్తించాలన్నారు. దాన ధర్మాల ముసుగులో ఉన్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నిజ స్వరూపం ఈ ఎన్నికల్లో బట్టబయలైందని తెలిపారు. సొంత పార్టీ టికెట్ కేటాయించక ముందే నామినేషన్ వేసి తన అధికార దాహాన్ని ప్రదర్శించాడని విమర్శించారు. తాను కౌన్సిలర్‌గా గెలిచిన వార్డునే చక్కదిద్దుకోలేని ఆయన నియోజకవర్గం మొత్తాన్ని ఏ మేరకు ఉద్ధరిస్తాడో ప్రజలు ఆలోచన చేయాలన్నారు. మున్సిపాలిటీలో ప్రజా సమస్యల కోసం పోరాటం చేయలేకపోయినా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అసెంబ్లీలో ప్రజల కోసం ఏం మాట్లాడుతాడు.. ఏం పోరాటం చేస్తాడు అని జూలకంటి ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ బీఆర్ఎస్ అభ్యర్థులు దందాలు చేసి మిర్యాలగూడను దోచుకోవడానికే ఓట్ల కోసం కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి గెలవడానికి ప్రయత్నిస్తున్న విషయాన్ని ప్రజలందరూ గుర్తించాలని కోరారు. నీతి నిజాయితీగా పార్టీలకు అతీతంగా చట్టసభల్లో ప్రజా గొంతుక వినిపించే అందరివాడుగా ప్రజలు తనను గెలిపించడానికి సిద్ధంగా ఉన్నారని, మిర్యాలగూడ గడ్డపై మరోసారి ఎర్రజెండా ఎగరటం ఖాయమని జూలకంటి ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్, జిల్లా కమిటీ సభ్యులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, రవి నాయక్, చౌగాని సీతారాములు, సైదమ్మ, రాగిరెడ్డి మంగారెడ్డి, పోలేపల్లి గోవింద్ రెడ్డి, రామకృష్ణ, రవి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారంలో భాగంగా కోలాటం ఆడుతున్న జూలకంటి రంగారెడ్డి

టికెట్ రాకున్నా.. పనిచేస్తా

- హంగ్ కోసం బిజెపి ప్రయత్నం
- అద్దంకి దయాకర్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్ పార్టీ కోసం రెబల్స్‌గా నామినేషన్ చేసిన అభ్యర్థులు విత్ డ్రా చేసుకోవడం చాలా సంతోషమని పిసిసి అధికార ప్రతినిధి అద్దంకి దయాకర్ అన్నారు. నాకు టికెట్ రాకున్నా పార్టీ గెలుపు కోసం పని చేస్తానని తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. '2014లో నేను కాంగ్రెస్‌లో చేరిన నెల రోజులకే నాకు టికెట్ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ మారిన 12 మంది ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో నేను ప్రచారం చేస్తా. టికెట్ రాని నేతలంతా కలిసి 12 నియోజకవర్గాల్లో ప్రచారం చేస్తాం. కాంగ్రెస్ పార్టీని వీడే నేతలంతా ఓడిపోయే పార్టీలోకి వెళ్తున్నారు. బిఆర్ఎస్, బిజెపి మధ్య లోపాయి కారి ఒప్పందం ఉంది. బిఆర్ఎస్ మీటింగ్‌లకు లేని నిబంధనలు కాంగ్రెస్‌కే ఎందుకు?. మళ్ళీ బిఆర్ఎస్ అధికారంలోకి వస్తే ప్రజాస్వామ్యం చచ్చిపోతుంది. హంగ్ కోసం బిజెపి ప్రయత్ని స్తుంది' అని విమర్శించారు.

అధికార ప్రతినిధులుగా మరో నలుగురు నియామకం

కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధులుగా కొత్తగా మరో నలుగురిని నియమించింది. ఈమేరకు బుధవారం పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ ఆ నలుగురి పేర్లను అధికారికంగా ప్రకటించారు. అల్దాస్ జానయ్య, చీటి. ఉమేష్‌రావు, ఠాగూర్ బాలాజీసింగ్, కకర్ల అశోక్‌ను నియమించారు.

నిరుద్యోగ సమస్య పరిష్కరించాలి

- ప్రజాస్వామ్యంలో ఎన్నికలు ఒక భాగం మాత్రమే : ప్రొఫెసర్ హరగోపాల్
- గన్‌పార్కు నుంచి నిరుద్యోగ చైతన్య యాత్ర ప్రారంభం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కెసిఆర్ పాలనలో ఉద్యమ నినాదమైన నియామకాల అంశం పక్కకుపోయిందని ప్రొఫెసర్ హరగోపాల్ విమర్శించారు. ప్రజాస్వామ్యంలో ఎన్నికలు ఒక భాగం మాత్రమేననీ, ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా ఉద్యోగ నియామకాల ప్రక్రియను సరైన పద్ధతిలో చేపట్టి యువతకు భవిష్యత్ చూపాలని కోరారు. బుధవారం హైదరాబాద్‌లోని గన్‌పార్కులోని అమరవీరుల స్తూపం దగ్గర నుంచి నిరుద్యోగ చైతన్య బస్సు యాత్రను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా హరగోపాల్ మాట్లాడుతూ.."నీళ్లు, నిధులు, నియామకాలు తెలంగాణ ఉద్యమ ఆకాంక్ష అని జయశంకర్ సార్ పదేపదే చెప్పేవారు. అది ఇంకా నెరవేరలేదు. ఉద్యమ నినాదమైన ఉద్యోగ నియామకాల ఆకాంక్ష నెరవేరుతుందని తెలంగాణ యువత కెసిఆర్‌ను నమ్మి గెలిపించింది. రెండోసారైనా నెరవేర్చకపోడా? అనే ఆశతో మళ్లీ గెలిపించింది. కానీ, పదేండ్లలో కెసిఆర్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. ఉద్యోగ ప్రకటనలు ఆశించినంతగా జరగలేదు. సిటీ లైబ్రరీ, సుందరయ్య విజ్ఞాన కేంద్రం లైబ్రరీ, అశోక్‌నగర్ హాస్టళ్లల్లో వేలాది మంది పోటీపరీక్షల కోసం కష్టపడుతున్నారు. ప్రభుత్వమేమో నోటిఫికేషన్లను సరిగా వేయడం లేదు. వేసినా పరీక్ష పత్రాలు లీకవుతున్నాయి. అనేక అవకతవకలు జరిగాయి. ఉద్యోగాలు అమ్ముకున్నారనే ఆరోపణలూ వస్తున్నాయి. ఇది ఆందోళనకరం. కెసిఆర్ ప్రభుత్వ పాలన చూస్తే షాకింగ్‌లాగా ఉంది" అని అన్నారు. ఏ రాజకీయ పార్టీనైనా నిరుద్యోగుల భవిష్యత్ గురించి ఆలోచించడం లేదని విమర్శించారు. విద్యార్థులు, నిరుద్యోగులు పల్లెల్లోకెళ్లి ప్రజలకు వాస్తవాలు చెప్పాలని కోరారు. ప్రజాసమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలనూ ఎండగట్టాలని సూచించారు. ప్రొఫెసర్ పీఎల్. విశ్వేశ్వరరావు మాట్లాడుతూ..ప్రజావ్యతిరేక పాలన రాష్ట్రంలో నడుస్తున్నదన్నారు. రాష్ట్రంలో నాలుగు వేల పాఠశాలలను మూసివేయడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ విద్యా, వైద్య రంగాలు నిర్వీర్యమైపోయాయని వాపోయారు. 33 జిల్లాల ఏర్పాటు తర్వాత రాష్ట్రంలో మూడు లక్షల పోస్టులు ఇంకా భర్తీ చేయాల్సి ఉందన్నారు. ఏఐసిసి మీడియా ఇన్‌చార్జి అజయ్ మాట్లాడుతూ..రాష్ట్రంలో ప్రతి ఇంట్లోనూ ఓ నిరుద్యోగి ఉన్నారనీ, వారంతా తలుసుకుంటే కెసిఆర్ ప్రభుత్వం కూలిపోవడం ఖాయమని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై లక్షా 30 వేల కోట్ల రూపాయలు ఖర్చుపెట్టిన కెసిఆర్ ప్రభుత్వం 25 లక్షలకుపైగా ఉన్న నిరుద్యోగుల సమస్య పరిష్కారం ఎందుకు దృష్టి సారించడం లేదని ప్రశ్నించారు. దేశంలోనే తెలంగాణలో అత్యధిక నిరుద్యోగముందని చెప్పారు. ఈ యాత్రకు కమ్యూనిస్టు పార్టీలు, కాంగ్రెస్ మద్దతు ఇచ్చాయని తెలిపారు. రియాజ్ మాట్లాడుతూ..ఈ యాత్రకు తాను కన్వీనర్‌గా, రెండు బస్సు యాత్రలకు లీడర్లుగా సలీంపాషా, అరుణకుమార్ ఉంటారని తెలిపారు. ఉత్తర, తెలంగాణ జిల్లాల్లో రెండు యాత్రలు 100 నియోజకవర్గాల్లో పర్యటిస్తాయన్నారు. పిసిసి అధికార ప్రతినిధి అద్దంకి దయాకర్ మాట్లాడుతూ..విద్యార్థుల చావులను రాష్ట్ర ప్రభుత్వం రాజకీయం చేస్తూ వారిపై లేనిపోని నిందలు మోపుతున్నదని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అదనపు పోస్టులు క్రియేట్ చేస్తామని చెప్పారు. ఉద్యోగ క్యాలెండర్ ప్రకటించి నోటిఫికేషన్..పరీక్ష..రిజల్ట్...నియామక పత్రాల అందజేతను నిర్దిష్ట కాలంలో టైం ప్రకారం పూర్తిచేస్తామని హామీనిచ్చారు. విద్యార్థుల ఉన్నత చదువుల కోసం వడ్డీలేని రుణాలు అందిస్తామని చెప్పారు.



In The Court The Principal Junior Civil Judge :: Kakinada
O.S.No. 204/2022
Between:
Sathi Ganapathi Reddy ...*Plaintiff*
AND
Jarpla Mohan ...*Defendant*
TO:
Jarpla Mohan, S/o. (Late) Pulianaick, Aged 40 years, Business, Pragathi Nagar, Bachupally, Hyderabad-90.
పై నెంబరు దావాలో ప్రతివాది అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా ఎన్నిసార్లు దావా సమన్లు పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం ది.08-12-2023వ తేదీకి వాయిదా వేసినారు. ఆరోజు ఉదయం గం॥ 10:30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని, మీ వకీలు ద్వారా గాని హాజరయ్యి మీయొక్క ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని ఎడల పై దావా మీ పరోక్షమున తీర్మానించబడును.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
బి.నరేష్
అడ్వకేట్, కాకినాడ.
సెల్: 6304251016

COURT NOTICE
IN THE COURT OF THE HON'BLE II ADDL.DIST.JUDGE: GUNTUR
I.A.NO.438/2023 IN O.S. NO.543/2015
Between:
Gopisetty Rajeswari and Others ......Petitioners /Plaintiffs
And
Kondaveedu Venkata Lakshmi and Others ...Respondents/Defendants
To,
R-9: Kalapala Chiranjeevi ,S/o.Anjaneya Sagar Prasad,R/o.Door No.861,MIG , Phase -1,BHEL,R.C.Puram, Hyderabad.
పై నెంబరు దావాలో ఐ.ఏ.నెం:438/2023లో 9వ రెస్పాండెంటు/ ప్రతివాది అయిన మీకు నోటీసు నిమిత్తము శ్రీకోర్టు వారు ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియజేయమని ఆర్డరు వేస్తూ ది:20-11-2023కి వాయిదా వేసినారు.కావున ఆ రోజున ఉ.గం.10-30 ని.లకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని,మీ తరపు వకీలు గారి ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణ లు తెలుపుకొనగలరు. లేనిచో మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.
వాయిదా తేది:20-11-2023
శ్రీ మతి.యమ్ .చారులత,
పిటీషనర్లు/వాదులు తరపు న్యాయవాది,
7/1, అరండల్ పేట,గుంటూరు.

IN THE COURT OF PRINCIPAL JUNIOR CIVIL JUDGE: NANDYAL
O.S.794/2021
Dereddy Sudheer Kumar Reddy. ...Plaintiff
Vs
Mallu Ramalingeswara Reddy. ...Defendant
SUIT SUMMONS TO DEFEND?NT
Mallu Ramalingeswara Reddy
S/o. Parameswara Reddy,
Doctor by Profession, Yarraguntla village
Bandi Atmakur mandal, Kurnool District (Old), Nandyal District (New)
Now residing at Flat No. 102, Adithya Apartment, Behind Hyderabad Cutial, Durga Nagar Colony, Punjagutta, Hyderabad, Telangana State
Take notice that the plaintiff has filed the above suit you for recovery of amount of Rs.1,73,183/- due under promissory note, and the said case posted on 30-11-2023 for making your appearance. In case of default in appearing on 30-11-2023 at 10-30 A.M. before the above court, the suit wll be deciding experty.
(కోర్టు వారు ఉత్తర్వుల మేరకు)
వాయిదా తేది : 30-11-2023
M. Siva Sankara Reddy
K. Gouri Shankar
Advocates, Nandyal

రేపు రాష్ట్రానికి రాహుల్‌గాంధీ

- ఒకే రోజు ఐదు నియోజకవర్గాల్లో ప్రచారం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎఐసిసి అగ్రనేత రాహుల్‌గాంధీ శుక్రవారం రాష్ట్రానికి రానున్నారు. రోడ్‌షోలు, కార్నర్ మీటింగ్‌లు, పాదయాత్రలు చేయనున్నారు. ఒకే రోజు పినపాక, నర్సంపేట, వరంగల్ తూర్పు, వరంగల్ పశ్చిమ, రాజేంద్రనగర్ నియోజక వర్గాల్లో ప్రచారాన్ని నిర్వహిస్తారు. శుక్రవారం ఢిల్లీ నుంచి శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి హెలిక్యాప్టర్‌లో ఉదయం 11 గంటలకు పినపాకకు చేరుకోనున్నారు. రోడ్ షో, కార్నర్ మీటింగ్ పాల్గొంటారు. పినపాక నుంచి నర్సంపేటకు చేరుకోనున్నారు. మధ్యాహ్నం రెండు నుంచి మూడు గంటల వరకు నర్సంపేటలో ప్రచారం నిర్వహిస్తారు. నర్సంపేట నుంచి రోడ్డు మార్గం ద్వారా వరంగల్ ఈస్ట్ చేరుకుంటారు. ఆ నియోజకవర్గంలో సాయంత్రం నాలుగు గంటలకు పాదయాత్ర చేయనున్నారు. వరంగల్ ఈస్ట్ నుంచి వెస్ట్‌కు వెళ్లనున్నారు. సాయంత్రం 6.30 గంటలకు రోడ్డు మార్గం ద్వారా హైదరాబాద్ రాజేంద్రనగర్ నియోజకవర్గంలో సభలో మాట్లాడుతారు. అనంతరం రాహుల్‌గాంధీ ఢిల్లీ వెళ్లనున్నారు.

ప్రమాదంలో ప్రజాస్వామ్యం

- మార్పు కావాలి .. హస్తం రావాలి
- ప్రాజెక్టుల రీడిజైన్ పేరుతో కెసిఆర్ రూ.లక్ష కోట్లు దోచుకుండు
- ఆదివాసీ, లంబాడాలు కాంగ్రెస్‌కు రెండు కళ్లు
- బోథ్, నిర్మల్ విజయభేరి సభల్లో టిపిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో పాలనలో మార్పులు రావాలంటే.. హస్తం గుర్తుకే ఓటు వేసి అధికారంలోకి తీసుకురావాలని, దొరల పాలన పోయి ఇందిరమ్మ రాజ్యం రావాల్సిన ఆవశ్యకత ఉందని టిపిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ప్రస్తుతం రాష్ట్రంలో బిఆర్ఎస్, బిజెపి, ఎంఐఎం ఒక వైపు ఉంటే కాంగ్రెస్, సిపిఐ, కోదండరాం మరో వైపు ఉన్నాయని గుర్తుచేశారు. సిఎం కెసిఆర్ ప్రాజెక్టుల రీడిజైన్ పేరుతో రూ.లక్ష కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. బుధవారం నిర్మల్ జిల్లా బోథ్, నిర్మల్ నియోజకవర్గాల విజయభేరీ సభల్లో పాల్గొన్న రేవంత్‌రెడ్డి బిఆర్ఎస్ వైఖరిపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. అంతకుముందు బోథ్, నిర్మల్ కాంగ్రెస్ అభ్యర్థులు ఆడె గజేందర్, శ్రీహరిరావును గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని, దాన్ని కాపాడుకోవడానికి జెండాలు.. ఎజెండాలు.. పక్కనపెట్టి కాంగ్రెస్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఆదివాసీ, లంబాడాలు కాంగ్రెస్‌కు రెండు కండ్ల లాంటి వారని, ఈ ఎన్నికల్లో చెరో ఆరు టికెట్లు కేటాయించి సమన్యాయం చేశామని తెలిపారు. రాష్ట్రంలో ఓట్లు చీలిపోకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఉమ్మడి రాష్ట్ర సమయంలో నీళ్లు, నిధులు, నియామకాల్లో తెలంగాణకు అన్యాయం జరుగుతోందని చెప్పిన కెసిఆర్.. తెలంగాణ పాలనలో వాటిని ఎందుకు అమలు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ వస్తే ఉద్యోగాలు వస్తాయనుకున్న నిరుద్యోగులకు ఈ పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో మొండిచెయ్యి చూపించారని విమర్శించారు. కుప్టి ప్రాజెక్టు పదేళ్లయినా నిర్మాణం జరగడం లేదని, మళ్లీ అడుక్కునే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. తండాలు, గూడేలను పంచాయతీలను చూశామని గొప్పలు చెప్పిన కెసిఆర్.. వాటికి పక్కా భవనాలు ఎందుకు నిర్మించలేదని ప్రశ్నించారు. రూ.వేల కోట్ల బకాయిలు సర్పంచ్‌లకు ఇవ్వకపోవడంతో ఆత్మహత్యలు చేసుకున్నారని.. ఖాళీ మద్యం సీసాలు అమ్ముకొని డబ్బులు తీసుకోవాలని మంత్రి దయాకర్‌రావు చెప్పారని ఇలాంటి వారిని దేనితో కొట్టాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. 80 వేల పుస్తకాలు చదివిన కెసిఆర్‌కు ఇసుక మీద బ్యారేజీ కడుతారా అని ప్రశ్నించారు. కెసిఆర్ అవినీతికి మేడిగడ్డ బలైపోయిందని, అన్నారం కుంగిపోయిందని.. సుందిళ్ల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందన్నారు. గతంలో మంత్రులను సైతం ప్రగతిభవన్‌కు రానీయని ముఖ్యమంత్రి ప్రస్తుతం బడి పిల్లలకు సైతం గులాబీ కండువాలు కప్పుతున్నారని ఎద్దేవా చేశారు. అచ్చంపేట అడవుల్లో పుట్టిన నాకు ఆదివాసుల జీవన పరిస్థితులు తెలుసన్నారు. అధికారంలోకి రాగానే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాను దత్తత తీసుకుంటామని.. నెల రోజుల్లోనే బోథ్‌ను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటుచేస్తామని హామీనిచ్చారు. అధికారంలోకి రాగానే ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని భరోసా ఇచ్చారు.కార్యక్రమంలో మాజీ కేంద్ర మంత్రి బలరాం నాయక్, జడ్‌పిటిసిలు గోక గణేష్‌రెడ్డి, మల్లెపూల నర్సయ్య, ఎంపిపిలు, ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విజయభేరీ సభల్లో మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి

ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న చెరుపల్లి

నిజాయితీగా పనిచేసే సిపిఎం అభ్యర్థిని గెలిపించండి

- కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పార్టీలు మారే అభ్యర్థులకు ఓటు వేసే కంటే నిజాయితీగా పనిచేసే సిపిఎం అభ్యర్థులను గెలిపించడం ద్వారా చట్టసభల్లో ప్రజా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకురావడానికి దోహదపడుతుందని ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు అన్నారు. నల్లగొండ జిల్లా చిట్యాల మున్సిపాలిటీ పరిధిలోని వెంకటాపురంలో బుధవారం ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. నేరడ గ్రామంలో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ.. దేశంలో బిజెపి ప్రమాదకరమైన రాజకీయాలు నడుపుతుందని విమర్శించారు. పేదల పక్షాన పోరాడే సిపిఎం చట్టసభల్లో ప్రజల పక్షాన తమ వాణి వినిపించాలని ఈ ఎన్నికల్లో పోటీ చేస్తున్నామని తెలిపారు. కష్టజీవుల హక్కులను కాపాడటం కోసం ప్రపంచమంతా కమ్యూనిస్టు పార్టీలు ఉన్నాయని, పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. కార్యక్రమంలో సిపిఎం అభ్యర్థి బొజ్జ చిన్న వెంకులు, రాష్ట్ర కమిటీ సభ్యులు తుమ్మల వీరారెడ్డి, జిల్లా నాయకులు జిట్టా నగేష్, అవిశెట్టి శంకరయ్య, ఆరూరి శ్రీనివాసులు, నాయకులు శీలా రాజయ్య, మాజీ ఎంపీపీ జొర్రిగల శ్రీనివాసులు, గ్రామ నాయకులు కందగట్ల గణేష్, పిల్లలమర్రి లక్ష్మయ్య, కుమారస్వామి పాల్గొన్నారు.

విస్తృత ప్రచారంలో తనను గెలిపించమని కోరుతున్న యర్రా శ్రీకాంత్

ప్రశ్నించే గొంతును అసెంబ్లీకి పంపండి

- సిపిఎం అభ్యర్థి యర్రా శ్రీకాంత్
- ఖమ్మం టూ టౌన్‌లో విస్తృత ప్రచారం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఖమ్మంలో నిత్యం ప్రజా సమస్యలపై పోరాడే సిపిఎంకి ఓటేసి తనను అసెంబ్లీకి పంపాలని సిపిఎం అభ్యర్థి యర్రా శ్రీకాంత్ ప్రజలకు పిలుపునిచ్చారు. బుధవారం ఖమ్మం టూ టౌన్‌లోని పెవిలియన్ గ్రౌండ్, మామిళ్లగూడెం ప్రాంతాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టూ టౌన్ ప్రాంతంలో సిపిఎం అధ్వర్యంలో మామిళ్లగూడెం అండర్ రైల్వే బ్రిడ్జి, కొత్త బస్టాండ్ అవినీతి, రోడ్లు, డ్రయినేజీ ఇలా అనేక రకాల సమస్యలపై నిరంతరం పోరాడిందని తెలిపారు. ఖమ్మంలో రెండు కార్పొరేట్ శక్తులు ఎన్నికల్లో డబ్బుతో గెలవాలని చూస్తున్నారని, వారు ఎప్పుడైనా ప్రజా సమస్యలపై పోరాడారా అని ప్రశ్నించారు. తాను సామాన్యుడిని అని, 35 సంవత్సరాలుగా కార్మిక ఉద్యమంలో వారి సమస్యలపై పోరాడుతూ, ఎవరికి ఎప్పుడు ఏ సమస్య వచ్చినా తాను మీకు అందుబాటులో ఉంటానని తెలిపారు. 45 ఏళ్ల నుంచి సిపిఎంలో ఉంటూనే అనేక పోరాటాలు చేసి, ప్రజల సమస్యల పరిష్కారం కోసం కృషి చేశానన్నారు. ఈ ఎన్నికల్లో సిపిఎం అభ్యర్థిగా తాను పోటీ చేస్తున్నానని, తనని గెలిపిస్తే అసెంబ్లీ వేదికగా ప్రజా సమస్యలపై పోరాడుతానని, మీరందరూ తనకు ఓట్లు వేసి గెలిపించగలరని ప్రజలను కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై. విక్రమ్, టూ టౌన్ కార్యదర్శి బోడపట్ల సుదర్శన్, నాయకులు మచ్చ సూర్యం, లక్ష్మి, నర్రా రమేష్, చింతల రమేష్, తుడుం ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

సిపిఎంతోనే భువనగిరి అభివృద్ధి

- రాష్ట్ర కమిటీ సభ్యులు పైళ్ల ఆశయ్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నియోజకవర్గ కేంద్రమయిన భువనగిరి మున్సిపాలిటీ అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందని సిపిఎం అభ్యర్థిని గెలిపిస్తే అభివృద్ధి చేసి చూపిస్తామని ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు పైళ్ల ఆశయ్య అన్నారు. బుధవారం భువనగిరి పట్టణ కేంద్రంలో బొమ్మాయిపల్లి, టీచర్స్ కాలనీ, హౌసింగ్ బోర్డు, బాహార్ పేట, ఎల్బీనగర్, వంజరివాడ, రాంనగర్ కాలనీలో అభ్యర్థి కొండమడుగు నర్సింహ ప్రచారంలో పాల్గొని మాట్లాడారు. భువనగిరి మున్సిపాలిటీ ఏర్పడి ఏళ్లు గడుస్తున్నా అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మల్టీస్పెషలిటీ ఆస్పత్రి, భువనగిరి చెరువు కట్ట మినీ ట్యాంక్ బండ్ చేస్తానని చెప్పి చేయలేదన్నారు. జిల్లా కేంద్రంలో క్రీడా మైదానం లేక, స్టడీ, ఉచిత కోచింగ్ సెంటర్లు లేక అనేకమంది నిరుద్యోగులు డబ్బులు వెచ్చించి కోచింగ్ తీసుకుంటున్నారన్నారని తెలిపారు. ఇప్పటికీ డిగ్రీ కళాశాల లేక అనేకమంది విద్యార్థులు ఉన్నత చదువుల కోసం హైదరాబాద్‌కు వెళు తున్నారన్నారు. సిపిఎం అభ్యర్థులను గెలిపిస్తే అభివృద్ధి ఏంటో చూపిస్తామన్నారు. భువనగిరి నియోజకవర్గం సిపిఎం ఎమ్మెల్యే అభ్యర్థి కొండమడుగు నరసింహ.. సుత్తి, కొడవలి, నక్షత్రం గుర్తుకు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ సీనియర్ నాయకులు రఘుపాల్, రాష్ట్ర కమిటీ సభ్యులు బట్టుపల్లి అనురాధ, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దాసరి పాండు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బొల్లు యాదగిరి, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు గడ్డం వెంకటేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వనం రాజు, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి సందెల రాజేష్, మున్సిపల్ కార్యదర్శి మాయ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మేడిపల్లిలో మహిళ దారుణ హత్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పక్కా ప్లాన్‌తో ఓ మహిళను దుండగులు అతి దారుణంగా హత్య చేశారు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం జరిగింది. సిఐ రామాంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. కందుకూరు మండలం ముచ్చర్ల వ్యవసాయ పొలంలో గుర్తుతెలియని మహిళా మృతదేహం ఉన్నట్లు బుధవారం ఉదయం పోలీసులకు స్థానికులు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని హత్య జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. మహిళా మృతదేహంపై ఉన్న ఆనవాళ్లను గుర్తించారు. ముచ్చర్ల గ్రామం దగ్గర దొరికిన మృతదేహం అనవాళ్లను మంచాల పోలీసులకు తెలియజేశారు. అప్పటికే ముందు రోజైన మంగళవారం రాత్రి మిస్సింగ్ కింద మంచాల మండలం పోలీస్ స్టేషన్‌లో మంథని అర్చన తమ అమ్మ యాదమ్మ రాత్రి అవుతున్నా తిరిగి ఇంటికి రాలేదని ఫిర్యాదు చేశారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంచాల మండలం జాపాల గ్రామానికి చెందిన మంథని యాదమ్మ (38) గా పోలీసులు గుర్తించారు. ఫార్మాసిటీ పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కాగా, మంథని యాదమ్మ తుర్కయంజాల్ కరెంట్ ఆఫీస్‌లో స్వీపర్‌గా పనిచేస్తున్నారు. మంచాల మండలం జాపాల గ్రామం నుంచి ఉదయం 9 గంటలకు బయలుదేరి సాయంత్రం పనులు ముగించుకొని తిరిగి ఇంటికి వెళ్లారు. అలా 14వ తేదీన రాత్రి 9 గంటలు అయినా ఇంటికి తిరిగి రాకపోవడంతో ఆమె కుమార్తె మంచాల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. మృతురాలిని గుర్తు తెలియని దుండగులు అతి దారుణంగా హత్య చేసినట్టు పోలీసులు గుర్తించారు. త్వరలోనే నిందితులను పట్టుకుంటామని సీఐ రామాంజనేయులు తెలిపారు.

రోడ్‌షోలో మాట్లాడుతున్న కెటిఆర్

మళ్లీ అధికారంలోకి వస్తే 'సౌభాగ్యలక్ష్మి' పథకం

- రుద్రంగి రోడ్ షోలో మంత్రి కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే పోయిన దరిద్రాన్ని మళ్లీ నెత్తిన పెట్టుకున్నట్టేనని మంత్రి కెటిఆర్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన వేములవాడ నియోజకవర్గ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావుకు మద్దతుగా రుద్రంగిలో రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో మూడోసారి అధికారంలోకి రాగానే కల్యాణలక్ష్మి మాదిరిగానే రాష్ట్రంలో ఉన్న 13.5 లక్షల మంది ఆడబిడ్డలకు సౌభాగ్యలక్ష్మి పథకం కింద 18 ఏండ్లు నిండిన అర్హులైన వారందరికీ నెలకు రూ.3 వేల చొప్పున పెన్షన్ ఇస్తామని తెలిపారు. దేశం, రాష్ట్రంలో 60 ఏండ్లు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అభివృద్ధికి ఏమీ చేయలేదని విమర్శించారు. కారు గుర్తుకు ఓటేయాలని కోరారు. చల్మెడ లక్ష్మీనరసింహారావు మాట్లాడుతూ.. తాను ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే రుద్రంగిలో ప్రభుత్వ ఆస్పత్రి, డిగ్రీ కాలేజ్‌ని మంత్రి కెటిఆర్ సహాయంతో ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు బోయినపల్లి వినోద్‌కుమార్, మాజీ జడ్పీ చైర్మన్ తుల ఉమ, ఎంపిపి స్వరూప మహేష్, జడ్‌పిటిసి గట్ల మినయ్య, ఎంపిటిసి మంచే లావణ్య రాజేశం, సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం, తదితరులు పాల్గొన్నారు.

పోడు సాగుదారులు, రైతులకు కొండంత అండ ఎర్రజెండా

- అమ్ముడుపోయే సరుకుకు ఓట్లు వేయుద్దు
- పేదల తరఫున పోరాడే వారికే ఓటేయండి
- బోడేపుడి వారసుడు భూక్యా వీరభద్రంను గెలిపించండి : నాగేశ్వరరావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నాటి నుంచి నేటి వరకు పోడు సాగుదారులు, రైతులకు అండగా ఎర్రజెండా ఉన్నదని, అవకాశవాద రాజకీయాలు చేస్తూ పార్టీలు మారే అభ్యర్థులను ఓడించి నిరంతరం ప్రజల మధ్య ఉంటూ ప్రజల పక్షాన పోరాడే సిపిఎం అభ్యర్థి భూక్యా వీరభద్రంను గెలిపించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు కోరారు. బుధవారం వైరా మండల పరిధిలోని జింకలగూడెం, రెబ్బవరం, ఖానాపురం, గొల్లపూడి, పాలడుగు, వల్లాపురం, అష్టగుర్తి, గొల్లెనపాడు గ్రామాల్లో వైరా సిపిఎం అభ్యర్థి భూక్య వీరభద్రం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. కమ్యూనిస్టులు చట్టసభల్లో ఉంటే పేద ప్రజలు, రైతులు, బుడుగు, బలహీన వర్గాల పక్షాన మాట్లాడతారని, ప్రభుత్వం చేసే అవినీతి, అక్రమాలను బయటపెట్టి ప్రశ్నిస్తారని భయపడి కమ్యూనిస్టులను గెలువకుండా చేయాలని ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఎవరికి ఓటు వేస్తే భద్రంగా ఉంటుందో, ఓటు విలువ, గౌరవం పెరుగుతుందో వారికి ఓటు వేయాల్సిన బాధ్యత ప్రజల మీద ఉందని విజ్ఞతతో ఆలోచించాలన్నారు. అవినీతి, దోపిడీ చేసి సంపాదించిన డబ్బులు పెట్టి ఓట్లు కొనుక్కొని, ఎమ్మెల్యే పదవిని అమ్ముకునే వారికి ఓట్లు వేయొద్దని, బోడేపుడి వారసుడు భూక్యా వీరభద్రంను ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొంతు రాంబాబు మాట్లాడుతూ.. గతంలో వైరాలో గెలిచిన ఎమ్మెల్యేలు ఏ పార్టీ తరపున గెలిచారో, ఇప్పుడు ఏ పార్టీలో ఉన్నారో ఆలోచించి ఓట్లు వేయాలని, ముగ్గురు ఎమ్మెల్యేలూ గెలిపించిన ప్రజలను మోసం చేసి కారు ఎక్కి ప్రగతి భవనం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత వైరా మండలంలో ఒక్క డబుల్ బెడ్ రూమ్ ఇల్లు, ఒక్క కొత్త రేషన్ కార్డు, ఒక్క ఆసరా పింఛన్లు ఇవ్వలేదని విమర్శించారు. నాటి నుంచి నేటి వరకు పోడు సాగుదారులు, రైతులకు అండగా ఎర్రజెండా ఉన్నదని, భూక్యా వీరభద్రానికి పోరాట చరిత్ర ఉన్నదని, పోడు రైతుల హక్కుల కోసం చర్లపల్లి జైలులో ఆరు నెలలు జైలు శిక్ష అనుభవించాడని తెలిపారు. పాలకవర్గం చేసే తప్పులను ప్రశ్నించడానికి సుత్తి, కొడవలి, నక్షత్రం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. అభ్యర్థి భూక్యా వీరభద్రం మాట్లాడుతూ.. ప్రజా ఉద్యమాల్లో పనిచేస్తున్న తనను గెలిపిస్తే ప్రజల సమస్యల పరిష్కారానికి అసెంబ్లీలో ప్రజా గొంతుక అవుతానని, ప్రజా సంక్షేమం కోసం సామాజిక న్యాయం కోసం కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మెరుగు సత్యనారాయణ, పారుపల్లి ఝాన్సీ, మండల నాయకులు బాజోజు రమణ, తూము సుధాకర్, కిలారు శ్రీనివాసరావు, బాణాల శ్రీనివాసరావు, గుడిమెట్ల మోహనరావు పాల్గొన్నారు.

సాంస్కృతిక వాతావరణం సామాజిక అకృత్యాలకు అడ్డుకట్ట

- సినీ కవి సుద్దాల అశోక్ తేజ

ప్రజాశక్తి - కల్చరల్

పిల్లల్లో కళలు సాహిత్యం పట్ల ఆసక్తి పెంపొందిస్తే మంచి సాంస్కృతిక వాతావరణం సమాజంలో నెలకొని ఆసిడ్ దాడులు, ఆత్మహత్యలు, హత్యలు వంటి సామాజిక అకృత్యాలకు అడ్డుకట్ట పడుతుందని ప్రముఖ సినీ కవి డాక్టర్ సుద్దాల అశోక్ తేజ అన్నారు.శ్రీ త్యాగరాయ గానసభ ప్రధాన వేదికపై జగతి ఆర్ట్స్ హర్షిత ఫౌండేషన్ నిర్వహణలో జవహర్ లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా చిల్డ్రన్ కల్చరల్ ఫెస్ట్ 2023 బాలల నృత్య సంగీత సందడిగా జరిగింది .సభా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సుద్దాల అశోక్ తేజ మాట్లాడుతూ బాలలు వెలిగే చందమామలు అనీ వారిలో ఉన్నత భావాలు కలిగించాల్సింది పెద్దలు గురువులు అన్నారు. దేశానికి ఆస్తుల్ని సమర్పణ చేసిన మహా పురుషుడు నెహ్రూ ఆదర్శనీయులు అన్నారు. సంస్థ స్థాపకులు సైదులు స్వాగతం పలికిన సభకు శ్రీలక్ష్మి అధ్యక్షత వహించారు. యువ కళా వాహిని అధ్యక్షుడు లంక లక్ష్మి నారాయణ, డాక్టర్ నీలిమ, వెంకట రెడ్డి గుదిబండి, శ్రవణ్ కుమార్, పిఎస్ మూర్తి, కెవి చారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురికి సేవా రత్న నృత్య రత్న, విద్యారత్న అవార్డ్స్ బహుకరించారు.

భద్రాచలంలో ముక్కోణపు పోటీ

- కంచుకోటలో ఎర్రజెండా రెపరెపలు
- గెలుపే లక్ష్యంగా బిఆర్ఎస్, కాంగ్రెస్ ఎత్తుగడలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రజా బలంతో సిపిఎం దూసుకుపోతుంటే.. ధన బలంతో ఎట్లాగైనా సీటు సాధించాలని గెలుపే లక్ష్యంగా బిఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య పోరు భద్రాచలం నియోజకవర్గంలో నువ్వా నేనా అన్నట్టు సాగుతోంది. ప్రధాన పార్టీలైన బిఆర్ఎస్, కాంగ్రెస్‌కు బిసి, దళితబంధు కమీషన్లు శాపంలా మారాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. మొత్తం మీద భద్రాచలం నియోజకవర్గంలో ముక్కోణపు పోరు నడుస్తోంది.

భద్రాచలం నియోజకవర్గం పేరు చెబితే సిపిఎం కంచుకోట అని గుర్తుకు వస్తుంది. 1978 నుంచి 1983 వరకు ముర్ల ఎర్రయ్య రెండు సార్లు, 1985 నుంచి 1994 వరకు మూడు పర్యాలు కుంజా బొజ్జి, 1999, 2004, 2014లో సున్నం రాజయ్య హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా సిపిఎం నుంచి ప్రాతినిధ్యం వహించారు. రాష్ట్ర విభజనలో భాగంగా పట్టున్న చింతూరు, కూనవరం, విఆర్‌కె పురం, భద్రాచలం రూరల్ మండలాలు ఆంధ్రాలోకి వెళ్లాయి. కుంజా బొజ్జి, సున్నం రాజయ్య వారసునిగా సిపిఎం నుంచి పోటీలో ఉన్న కారం పుల్లయ్యకు ఉద్యమాల చరిత్ర ఉంది. గిరిజన సంఘం నాయకునిగా, పోలవరం, పొడుభూములపై చేపట్టిన పోరాటాలు కలిసి వచ్చే అంశాలు. భద్రాచలం నియోజకవర్గంలో 1952 నుంచి 2018 వరకు జరిగిన ఎన్నికల్లో ఐదు సార్లు కాంగ్రెస్ అభ్యర్థులే గెలుపొందారు. 1957లో పివి రావు, 1967లో కన్నయ్య దొర, 1972లో రామచంద్రయ్య, 2009లో కుంజా సత్యవతి, 2018లో పొడెం వీరయ్య గెలుపొందారు. కాగా, దళితబంధు ఎంపికలో కమీషన్ల పర్వం బిఆర్ఎస్‌కు ప్రతికూల అంశంగా మారింది.

గులాబీ తహతహ..

తెలంగాణ ఆవిర్భవించిన నాటి నుంచి భద్రాచలం గడ్డపై గులాబీ జెండా ఎగురవేయాలని బిఆర్ఎస్ పార్టీ తహతహలాడుతున్నా నేటికీ సాధ్యం కాలేదు. 2014లో మానే రామకృష్ణను బరిలో నిలిపినా కనీసం పోటీ కూడా ఇవ్వని పరిస్థితి. 2018లో బిఆర్ఎస్ నుంచి బరిలో ఉన్న డా.తెల్లం వెంకట్రావు.. పొడెం వీరయ్యపై 11 వేల ఓట్ల తేడాతో ఓడిపోయారు. 2023లోనూ తిరిగి వెంకట్రావు టిక్కెట్ దక్కించుకున్నారు. అయితే అంతర్గత కుమ్ములాటలో బలమైన బీసీ నాయకులు బిఆర్ఎస్ పార్టీలో చేరడంతో వారి ప్రభావం ఏ మేరకు ఉంటుందనేది బిఆర్ఎస్ పార్టీలో చర్చ నడుస్తోంది. మూడు పార్టీల మధ్య పోరు రసవత్తరంగా ఉంది.

పోరు గడ్డ పాలేరు.. ప్రగతి జాడ ఎర్రజెండా

- క'న్నీటి' కష్టాలపై చట్టసభల్లో కమ్యూనిస్టుల గళం
- భూపతిరాజు మొదలు బాజీ హన్మంతు వరకు..
- వెంకట వీరయ్య నుంచి ఎంపిగా తమ్మినేని వరకు..
- ఆ ప్రాంతం అభివృద్ధితో విడదీయలేని బంధం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పాలేరు ప్రగతి జాడలు చూసింది కమ్యూనిస్టుల పాలనలోనే.. చట్టసభల్లో ప్రజల తరఫున గొంతు విప్పింది కమ్యూనిస్టు ఎమ్మెల్యేలు, ఎంపిలే.. తలాపున పాలేరు.. తడి ఆరిన గొంతులు.. నెర్రలు వారిన చెరువులు.. నోళ్లు తెరిచిన పంటచేలు.. 1962 నుంచి అనేక ఏళ్లపాటు పాలేరు నియోజకవర్గం వివిధ పార్టీల ఏలుబడిలో ఉంది. కానీ ఎర్రజెండా నీడలోనే ప్రగతి జాడలు చవి చూసింది. రైతుకూలీల పక్షాన చట్టసభల్లో గళం విప్పిన ఈ నియోజకవర్గ ఎమ్మెల్యేలు అతికొద్దిమంది ఉంటే వారిలో కమ్యూనిస్టుల గొంతే బిగ్గరగా వినిపించింది.

ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనే హాట్ సీటుగా ప్రాచుర్యంలోకి వచ్చిన పాలేరు నియోజకవర్గం 2009 సంవత్సరానికి పూర్వం ఎస్‌సి రిజర్వుడ్ స్థానం. అప్పట్లో కూసుమంచి, నేలకొండపల్లి, తిరుమలాయపాలెం, ముదిగొండ మండలాలతో కూడిన ఈ నియోజకవర్గం.. ఇప్పుడు ముదిగొండ మధిర సెగ్మెంట్లోకి పోగా.. ఒకప్పుడు ఖమ్మం అసెంబ్లీలో భాగంగా ఉన్న ఖమ్మం రూరల్ మండలం ఇప్పుడు పాలేరులోకి చేరింది. 1962 నుంచి ఇప్పటి వరకు నియోజకవర్గంలో 15సార్లు ఎన్నికలు జరగ్గా, మూడుసార్లు కమ్యూనిస్టు పార్టీలు విజయం సాధించాయి. దీనిలో రెండుసార్లు సిపిఎం గెలుపొందింది. నియోజకవర్గం నుంచి ఎక్కువసార్లు కాంగ్రెస్ గెలుపొందగా, 2016 ఉప ఎన్నికలో మాత్రమే బీఆర్ఎస్ గెలిచింది. ఇదీ ఈ నియోజకవర్గ రాజకీయ స్వరూపం.

కమ్యూనిస్టుల 12 ఏళ్ల పాలనలోనే..

1983లో సిపిఎం బలపరిచిన సిపిఐ అభ్యర్థి భీమపాక భూపతిరావు, 1985లో సిపిఎం నుంచి బాజీ హన్మంతు, ఆ తర్వాత 1994లో సంద్ర వెంకటవీరయ్య హయాంలోనే నియోజకవర్గం అభివృద్ధి పథంలో పయనించింది. 1996లో తమ్మినేని వీరభద్రం ఎంపిగా ఉన్న సమయంలోనే ప్రజా సమస్యలపై పాలేరు గొంతు చట్టసభల్లో వినిపించింది.

క'న్నీటి' కష్టాలు తీర్చిన కమ్యూనిస్టులు..

కృష్ణానది ఎడుమ కాలువ నీటిని నిల్వ చేసేందుకు నెలకొల్పిన పాలేరు రిజర్వాయర్ నియోజకవర్గంలోని కూసుమంచి మండలంలోనే ఉంది. కానీ చుట్టుపక్కల ప్రాంతాలు అనేక ఏండ్లపాటు క'న్నీటి' కష్టాలను చవిచూశాయి. ఈ నేపథ్యంలోనే ప్రస్తుత పాలేరు నియోజకవర్గ సిపిఎం అభ్యర్థి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం దుమ్ముగూడెం ప్రాజెక్టు సాధన కోసం 2003-04లో 2,668 కి.మీటర్ల పాదయాత్ర నిర్వహించారు. తద్వారా కృష్ణా నది నీటితోనే కాకుండా గోదావరి జలాలనూ రప్పించి బీడు భూములకు నీరందించాలనే ప్రయత్నం సాగించారు. ఫలితంగానే నేడు పేరు మార్చుకొని సీతారామ ఎత్తిపోతల పథకంతో ఎన్ఎస్‌పి స్థిరీకరణకు బీజం పడింది. పాలేరు పాత కాల్వకు 12వ కి.మీటర్ దగ్గర సాగర్ ప్రధాన కాల్వ నుంచి పైపులైన్ వేయడం ద్వారా పాత కాల్వ చివరి భూములకు నీరందిం చొచ్చని సిపిఎం అనేక పోరాటాలు చేసింది. అసెంబ్లీలోనూ గళం వినిపించింది. అనేక లిఫ్ట్‌లు, చెక్‌డ్యాంలు కమ్యూనిస్టుల పాలన సమయంలోనే నిర్మాణమయ్యాయి.

రైతుకూలీలకు బాసటగా..

కమ్యూనిస్టులు చట్టసభల్లో ఉన్న కాలంతోపాటు లేని సమయంలోనూ రైతు, కూలీల కోసం పోరాటాలు సాగాయి. ప్రజావాణి వినిపించారు. కూసుమంచి మండలంలో పదివేల ఎకరాలు, నేలకొండపల్లిలో 15 వేల ఎకరాలకు సాగు నీరందక చెరకు, వరి పంటలు ఎండిపోతున్న సమయంలో కమ్యూనిస్టులు రైతుల పక్షాన పోరాడారు. నీరందక పంటలు ఎండిపోవడంతో అటు రైతులు ఎకరానికి రూ.20వేల నుంచి రూ.లక్ష వరకు నష్టపోగా.. ఇటు కూలీలు రోజుకు రూ.300 నుంచి రూ.500 కూలి నష్టపోయిన విషయాన్ని చట్టసభల దృష్టికి తీసుకొచ్చారు. సమస్య పరిష్కారానికి కృషి చేశారు. ప్రభుత్వరంగంలో ఉన్న రాజేశ్వరపురం చక్కెర కర్మాగారాన్ని ప్రయివేటు వ్యక్తుల చేతుల్లోకి పోకుండా విశ్వప్రయత్నం చేశారు. ఇలా రైతు, కూలీల తరఫున ఎన్నో పోరాటాలు చేయడమే కాకుండా చట్టసభల్లో ఎర్రజెండాలు గళం వినిపించాయి.

ప్రజల పక్షాన పోరాటాలు

కమ్యూనిస్టులు చట్టసభల్లో లేనప్పటికీ ప్రజా పోరాటాల్లో నిరంతరం ముందున్నారు. నియోజకవర్గంలోని గ్రీన్‌ఫీల్డ్ హైవే, కొరవి- కోదాడ జాతీయ రహదారి, డోర్నకల్ – మిర్యాలగూడ, డోర్నకల్- సూర్యాపేట మీదుగా వెళ్లే రైల్వేలైన్‌ల అలైన్‌మెంట్ మార్పించడంలో కమ్యూనిస్టుల పోరాటం ఎడతెగనిది. కమ్యూనిస్టుల పోరాట ఫలితంగానే భూ నిర్వాసితులకు అంతో ఇంతో మేలు జరిగింది. భూములు, ఆస్తుల నష్టం తక్కువగా ఉండేలా అలైన్‌మెంట్ మార్పించడంలో కమ్యూనిస్టుల పోరాటాలు కీలకంగా మారాయి. అలాంటి కమ్యూనిస్టులు చట్టసభల్లో ఉంటే ఇంకా ఎంతో మేలు జరుగుతుందనే విశ్వాసం ప్రజల్లో ఉంది.